


పెద్దగెడ్డలోకి భారీగా నీరు

కిందకి విడిచిపెట్టిన అధికారులు



పాచిపెంట : పెద్దగెడ్డ జలాశయం నిండు కుండను తలపిస్తుంది. రెండు రోజులుగా ఎడతెరిపు లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుందని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుండి ఇన్‌ఫ్లో సుమారు 250 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరడంతో గరిష్ట నీటిమట్టం 213.8 అడుగులకు చేరింది. దీంతో వెంటనే అధికారులు అప్రమత్తమై దిగువ ప్రాంతమైన వేగావతి నదిలోకి ఒక గేటు ద్వారా శనివారం 250 క్యూసెక్కుల వరదనీటిని విడిచి పెడుతున్నారు.

ప్రజల గొంతుకవుతాం

జిల్లా ఎమ్మెల్యేల మనోగతం

రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తెలిపారు. ఈనెల 22 నుంచి వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు తొలిసారి శాసనసభలో మాట్లాడే అవకాశం లభించనుంది. ఈనేపథ్యంలో తాము అసెంబ్లీలో ప్రస్తావించదలచిన అంశాలను ప్రజాశక్తికి తెలిపారు.

– ప్రజాశక్తి, విలేకర్ల బృందం

గిరిజన యూనివర్సిటీపై చర్చిస్తా



ఈ సమావేశాల్లో ప్రధానంగా మూడు అంశాలను సభ దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నాను. గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలం రెల్లిలో ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకెళ్తా. ప్రధానంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి రోడ్ల గుంతలు పూడ్చేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతాను. శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలపాలని సమావేశాల్లో ప్రస్తావిస్తాను.

రైతుల సమస్యలను ప్రస్తావిస్తా



గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రైతులను పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది. బాధ్యతలేని ప్రభుత్వం వల్ల రైతులకు కష్టాలొచ్చాయి. కోలుకోలేని విధంగా నష్టపోయారు. గత వైసిపి సర్కారు తోటపల్లి ప్రాజెక్టు, కాలువలపై తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. జిల్లాలోని రైతులకు ఐదేళ్లపాటు తోటపల్లి నుంచి సాగునీరు అందకపోవడంతో పంటలు పండక రూ.2 వేల కోట్ల మేర రైతులకు నష్టం వాటిల్లింది. దీనిపై అసెంబ్లీలో ప్రస్తావించి, సాగునీటి కాలువల కోసం నిధుల విడుదలకు కృషి చేస్తాను. నియోజకవర్గంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాను.

- కిమిడి కళావెంకటరావు, చీపురుపల్లి ఎమ్మెల్యే

రామతీర్థ సాగర్‌కు నిధులు కోరుతా



నియోజకవర్గ ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపిస్తాను. ప్రస్తుతం మాకు అసెం బ్లీలో చర్చించడానికి ప్రశ్నలు ఇంకా అడగలేదు. అవకాశం వస్తే కచ్చితంగా నియోజకవర్గంలో ప్రధానంగా తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని, సంబంధిత నిధులు గురించి చర్చిస్తాను. తద్వారా సాగునీరుతో పాటు తాగునీరు సమస్య కొంత పరిష్కారమవుతుంది. నియోజకవర్గంలో ఎక్కువగా ఉప్పునీరు కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నందున తాగునీటి సమస్య పరిష్కారంపై చర్చిస్తాను. ప్రభుత్వ భూముల పరిరక్షణ, రైతాంగానికి అవసరమైన ఇరిగేషన్ కాలువలు, వాటి సామర్థ్యం ఎలా పెంచుకుంటామన్నది దానిపై చర్చిస్తాను. 596, 117 జీవోలను రద్దు చేయమని కోరుతాను. తీరప్రాంతం మత్స్యకార గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలపై చర్చిస్తాను.

- లోకం నాగమాధవి, నెల్లిమర్ల ఎమ్మెల్యే

గిరిజనుల సమస్యలను ప్రస్తావిస్తా



తొలి అసెంబ్లీ సమావేశాల్లో గిరిజన సమస్యలను ప్రస్తావిస్తాను. ఐదేళ్ల వైసిపి పాలనలో రోడ్లు దుస్థితి దారుణంగా ఉంది. పార్వతీపురం–కొమరాడ ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. గిరి శిఖర గ్రామాలకు రోడ్లు లేక గిరిజనులకు మెరుగైన వైద్యం అందడం లేదు. నేటికీ చాలా గ్రామాల్లో డోలీల మోతలే శరణ్యం అవుతున్నాయి. వ్యాధుల వ్యాప్తితో రోగుల సంఖ్య పెరుగుతుందని ఆసుపత్రులకు వస్తున్న వారికి బెడ్లు చాలడం లేదు. ఏజెన్సీలో వైద్యం మెరుగుకు ప్రభుత్వం సహకారం అందించాలి. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రతి గ్రామంలోను పాఠశాలలు ఏర్పాటు చేయాలి.

- తోయక జగదీశ్వరి, కురుపాం ఎమ్మెల్యే

'జంపరకోట'కు నిధులు కోరుతా



నియోజకవర్గంలో ప్రధానమైన జంపరకోట జలాశయం నిర్మాణానికి నిధులు కోరుతాను. తోటపల్లి ఎడమ కాలువ ఆధునీక రణ పనులు వేగవంతం గా పూర్తయ్యేలా అసెంబ్లీలో చర్చి స్తాను. నియో జకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నూతన భవనం నిర్మాణానికి ప్రస్థావిస్తాను. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న సమస్యలపై కూడా మాట్లాడుతాను.

- నిమ్మక జయకృష్ణ, పాలకొండ ఎమ్మెల్యే

సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా..



రాజాం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. రాజాంలో డ్రైనేజి వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, వాటిని అండర్ డ్రైనేజీగా తీర్చిదిద్దేందుకు అసెంబ్లీలో చర్చిస్తాం. ట్రాఫిక్ ఇబ్బందులు దృష్ట్యా ఫ్లైఓవర్‌ను ఏర్పాటుకు చర్చిస్తాం. రాజాం– పాలకొండ ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. వాటిపై అసెంబ్లీలో చర్చిస్తాం. ఈ నాలుగు మండలాలకు తోటపల్లి, మడ్డువలస జలాశయాల శివారు గ్రామాల వరకు సాగునీరు, తాగునీరు అందించేందుకు మాట్లాడతాను. రాజాంలో ఉన్నత విద్యకు కళాశాల ఏర్పాటు, ఆకులలోవ, కట్టగెడ్డ, రేగిడి సాయన్న ఛానల్ ఆధునీకరణ పనులపై అసెంబ్లీలో చర్చిస్తాను.

- కోండ్రు మురళీమోహన్, రాజాం ఎమ్మెల్యే

ఆర్అండ్‌బి రోడ్ల దుస్థితిని వివరిస్తా



అసెంబ్లీ సమావేశాల్లో పారాది వంతెన, ఆర్అండ్‌బి రోడ్లు దుస్థితిపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను. టిడిపి ప్రభుత్వ హయాంలో పారాది వంతెన నిర్మాణానికి తన సోదరుడు సుజయకృష్ణ రంగారావు మంత్రిగా ఉన్న సమయంలో నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిధులను వెనక్కి మళ్లించి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాయి. ఆర్అండ్‌బి రోడ్లు పాడైపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బి రోడ్లకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. శివడవలస, లోచర్ల వద్ద తోటపల్లి కాలువపై ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు నిధులు కోరుతాను.

- బేబినాయన, బొబ్బిలి ఎమ్మెల్యే

తాగు, సాగునీటి సమస్యపై ప్రస్తావిస్తా..



నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన తాగునీటి సమస్యను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తాను. దాంతో పాటు సాగునీటి సమస్యపై మాట్లాడుతా. గత టిడిపి ప్రభుత్వ హయాంలో జిల్లాకు మేలు చేకూరేలా మా తండ్రి హయాంలో ఇటు రైతులకు, అటు తాగునీరు సమస్యను అధిగమించడానికి నదులు అనుసంధానించాలని భావించారు. దాని పూర్తిచేసే విధంగా తోటపల్లి రిజర్వాయర్ నుంచి గడిగడ్డ, గడిగడ్డ నుంచి చంపావతి అనుసంధానం చేయగలిగితే రైతులకు రెండు పంటలకు సాగునీరు అందుతుంది. విజయనగరం కార్పొరేషన్‌కు తాగునీటి సమస్య తీరుతుంది. గత వైసిపి ప్రభుత్వం ఈ విషయాలపై పూర్తి నిర్లక్ష్యం వహించింది. ఇవి పూర్తి చేయగలిగితే విజయనగరానికి నీటికష్టాలు తీరినట్లే. జిల్లా సర్వ జన ఆస్పత్రిలో సిబ్బంది, పడకల కొరతపై ప్రస్తావిస్తాను.

- పి.అదితి గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కోరుతా..



పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సమావేశంలో కోరుతాను. పెండింగ్ లో ఉన్న వంతెనలు, రహదారులు పనులకు, జంఝావతి, ఆడారు జలాశయ పథకాలకు నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. నూతనంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి అనుగుణంగా భవనాలు సౌకర్యాలు ఏర్పాటుకు పనులు మంజూరు చేసి ప్రారంభిస్తే రాబోయే ఐదేళ్లలో పూర్తవుతాయి. బలిజిపేట సీతానగరం పార్వతీపురం మండలాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీరు తాగునీరు, రహదారి మౌలిక సదుపాయాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కోరుతా..

- బి.విజయ్‌చంద్ర, పార్వతీపురం ఎమ్మెల్యే



మరమ్మతులకు గురైన వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి – జియ్యమ్మవలస

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ జిల్లా కమిటీ ఆధ్వర్యాన మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం బృందం పరిశీలించింది. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆధ్వర్యంలో ఈ బృందం గిరిజన వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని తెలిపారు. రావాడ–రామభద్రపురంలో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉందని తెలిపారు. నాడు నేడు పనుల్లో భాగంగా రూ.10 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతుకు గురి కావడంతో అక్కడ విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు లేదన్నారు. విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఆరోగ్య కార్యకర్తను నియమించాలని డిమాండ్ చేశారు. స్థానిక వైద్యాధికారి మెడికల్ క్యాంపును నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపాలన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్స్ ఛార్జీలను ఇస్తూ డైట్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 236 మంది విద్యార్థులు ఉన్న ఈ వసతి గృహంలో గిరిజన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యను అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు త్రినాధరావుతో మాట్లాడి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూను సక్రమంగా అమలు చేస్తూ, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం లక్ష్మణరావు, జిల్లా సహాయ కార్యదర్శి మండంగి రమణ, కొల్లి గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.


వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి – సాలూరు



వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ , గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఒక ప్రకటన శనివారం విడుదల చేశారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఆయా జిల్లా కలెక్టర్లతో మంత్రి మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలని, యంత్రాంగాన్ని పూర్తి సన్నద్ధం చేయాలని సూచించారు. పలు ప్రాంతాల్లో కొండ వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయని, గెడ్డలు, వాగుల ప్రవాహ ఉధృతి దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలనీ అన్నారు. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలలకు శెలవు కూడా ప్రకటించామని చెప్పారు. పిల్లలు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి మంత్రి సంధ్యారాణి విజ్ఞప్తి చేశారు. శిథిల భవనాలలో ఎవరు ఉండవద్దని కోరారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించుటకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆమె ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహార సరఫరాకు ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. మధ్యాహ్న వంట ఏజెన్సీలను సిద్ధం చేయాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలను దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమగు పాలు, బిస్కెట్లు, రొట్టెలు తదితర సామాగ్రిని సిద్దంగా ఉంచాలని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

ఆయిల్ పామ్ సాగులో గిరిజన రైతులకు అధిక ప్రాదాన్యమిచ్చి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై ఉద్యానశాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఉద్యానశాఖ అధికారుల లక్ష్యానికి మించి పనిచేయాలని తెలిపారు. జిల్లాలో అయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపునకు అనుకూలమైన భూములను గుర్తించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ఆసక్తి గల గిరిజన రైతులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మొక్కలు నాటుటకు అనుకూలమైన కాలం గనుక మొక్కల పంపిణీ వెంటనే పూర్తి చేయాలని కోరారు. సెప్టెంబరు నాటికి 50 శాతం లక్ష్యాలు పూర్తిచేయాలని తెలిపారు. ఎస్‌టి, ఎస్‌సి, బిసి వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులకు ఉద్యానవన పంటలు సాగు చేసుకొనేందుకు ఉపాధిహామీ చట్టాన్ని అనుసంధానం చేసి, రైతులు తమ పొలంలోనే పనిచేసి ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేసే ప్రాంతాల్లో నీటి ఎద్దడి రాకుండా ఉపాధిహామీ ద్వారా బోర్ వెల్ రీఛార్జి నిర్మాణాలు, ఫారంపాండ్, బౌండరీ ట్రెంచస్ నిర్మాణాలు చేయాలని తెలిపారు. ఇన్‌ఛార్జి జిల్లా ఉద్యానశాఖ అధికారి వి.రాధాకృష్ణ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు వివరాలు తెలియజేస్తూ జిల్లాలో 50 వేల ఎకరాల్లో సాగులో ఉందని, ఈ ఏడాది మరో నాలుగు వేల ఎకరాల సాగుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. 5వేల ఎకరాల భూమిని సాగుకు అనుకూలమైందిగా గుర్తించినట్లు తెలిపారు. సమావేశంలో పలువురు అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టోల్‌గేట్‌ను తరలించాలని కేంద్రమంత్రికి వినతి

విజయనగరం : డెంకాడ జొన్నాడ సమీపంలోని బోడమెట్టపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేట్‌ను బైపాస్ రోడ్డులోకి మార్చాలని కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఎంఎస్ఎంఇ, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ లేఖ రాశారు. టోల్‌గేట్ వల్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, వాహనదారులకు పెను భారంగా మారిందని పేర్కొన్నారు.టోల్‌గేట్ ఏర్పాటు చేసే ముందు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టలేదని పేర్కొన్నారు

గందరగోళానికి తెరదించాలి

యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

స్థానిక ఐటిడిఎ పరిధిలో ఇటీవల జరిగిన సిఆర్‌టిల రెన్యువల్ కౌన్సిలింగ్‌లో జరిగిన గందరగోళానికి ఐటిడిఎ అధికారులు స్పందించి తెరదించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్ మురళీమోహన్‌రావు కోరారు. ఈ మేరకు శనివారం ఐటిడిఎ డిడి కార్యాలయంలో వినతి సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెన్యువల్స్‌లో జిపిఎస్ పాఠశాలలో 10లోపు విద్యార్థులున్న పాఠశాలకు ఒక్క సిఆర్‌టిని కేటాయించలేదన్నారు. పాఠశాలలు తెరిచి 40 రోజులు కావస్తున్నా ఏ ఒక్క టీచర్ లేకపోవడం దారుణమన్నారు. సిఆర్‌పిల రెన్యువల్ జరిగేటప్పుడు నియమిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు నియమించకుండా దీనికి సొంత భాష్యం చెబుతున్నారని అన్నారు. గతఏడాది పనిచేసిన సిఆర్‌టి పోస్టులన్నింటికీ ఆర్థిక అనుమతి ఉన్నప్పటికీ అగ్రినెస్ట్ ఎస్‌జిటిలకు ఇంకా నియామకాలు జరగలేద న్నారు. డిఎస్‌సి నుంచి మినహాయింపు కోరుతూ కొంతమంది సిఆర్టిలు హైకోర్టుకు వెళ్తే వీరికి అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, ఈ కౌన్సిలింగ్‌లో కోర్టుకు వెళ్లిన వారికి కాకుండా కోర్టుకు వెళ్లని వారికి నియామకాలు ఇచ్చారని వీటన్నింటిపైన ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకువెళ్దా మంటే వారు అందుబాటులో లేకపోవడం వల్ల డిడికి వినతినిచ్చామని అన్నారు. పిఒ ఈ విషయంపై స్పందించి తగు చర్యలను చేపట్టా లని, తద్వారా ఈ గందరగోళం వల్ల ఒత్తిడికి గురైన సిఆర్టిల మనో వ్యధను దూరం చేయాలని కోరారు.



విచారణ చేపడుతున్న ఐసిడిఎస్ పీడీ రాణి

అంగన్వాడీ కేంద్రంలో పీడీ తనిఖీ

అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ

ప్రజాశక్తి – సాలూరు

పట్టణంలోని రామా కాలనీలో మూడో నెంబర్ అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త బి.రాధ నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. రిజిస్టర్‌లో ఏడుగురు పిల్లలు ఉన్నట్లు చూపుతూ ఆన్‌లైన్ యాప్‌లో 13 మంది పిల్లల పేర్లు నమోదు కావడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో సూపర్‌వైజర్ భారతిని పిడి ఎంఎన్ రాణి తప్పు పట్టే ప్రయత్నం చేశారు. తన తనిఖీల్లో గుర్తించిన లోపాలను సిడిపిఒ సత్యవతి దృష్టికి తీసుకెళ్లానని, వాటి జోలికి వెళ్లొద్దని సిడిపిఒ వారించారని సూపర్‌వైజర్ చెప్పారు. దీంతో అక్కడే ఉన్న సిడిపిఒ ఖంగుతిన్నారు. దీంతో సిడిపిఒ సత్యవతి, సూపర్‌వైజర్ భారతి మధ్య వాగ్వివాదం జరిగింది. ఇదిలా వుండగా శుక్రవారం పట్టణానికి చెందిన కొంతమంది అంగన్వాడీ కార్యకర్తలు పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలతను కలిసి అంగన్వాడీ కార్యకర్త రాధపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం కార్యకర్త రాధ నిర్వాకంపై ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, ఆర్డీవో హేమలత విచారణ చేపట్టారు. ఇప్పటికే కార్యకర్త రాధకు మూడు చార్జి మెమోలు జారీ చేశారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్



సదస్సులో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

కళాశాలల్లో ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలకు గురవుతారని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎస్.దామోదరరావు తెలిపారు. శనివారం స్థానిక వేతాంత జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన న్యాయ అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను అవమానకరంగా మాట్లాడడం, వేధించడం చేస్తున్నారని, అలా చేయడం చట్ట వ్యతిరేక చర్యలని పేర్కొన్నారు. ఒక్కోసారి అదే ప్రాణాంతకమవుతుందన్నారు. కొంతమంది విద్యార్థులు తెలిసీ తెలియక చేసే పనులు వారి ఉజ్వల భవిష్యత్‌ను అంధకారంలో పడేస్తుందన్నారు. విద్యార్థులు వారి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మసలుకోవాలని సూచించారు. విద్యార్థినిలు, మహిళలు ప్రతి ఒక్కరూ దిశా యాప్ డౌన్లోడ్ చేసుకుని ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేయాలని సూచించారు. నేషనల్ యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్ ప్రభుత్వం గతంలోనే ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది 24 గంటలు పని చేస్తుందని తెలిపారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, చట్టానికి ఎవరూ అతీతులుకారని, తప్పు చేస్తే ఎంతటి వారైనా శిక్షార్హులేనని జడ్జి అన్నారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్ మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే సంఘటనలు చాలా ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు వారి ఆలోచనా ధోరణి మెరుగు పరుచుకోవాలని సూచించారు. సమస్యలను ఎదుర్కొనే ధైర్యం విద్యార్థుల్లో ఉండాలని పేర్కొన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత పదవులు సాధించాలన్నారు. కళాశాలల్లో ఏమైనా సమస్యలు వస్తే వెంటనే ప్రిన్సిపల్, తల్లిదండ్రులకు తెలపాలని సూచించారు. లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు మాట్లాడుతూ చట్టాలపై ప్రతీ విద్యార్థికి అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాధ్యతలు, హక్కులు తెలుసుకోవడం వల్ల క్రమశిక్షణతో ఉంటారని పేర్కొన్నారు. ఎవరైనా తప్పు చేస్తే కోర్టులు కఠిన శిక్షలు వేయడానికి కూడా వెనకాడని అన్నారు. అనంతరం టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలకు పతకాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పెంట అప్పారావు, సీనియర్ లెక్చరర్ వివేకానంద, సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలను పరిశీలించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి – భామిని

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యమందించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి కె.విజయపార్వతి వైద్యులకు సూచించారు. మండలంలోని బత్తిలి, భామిని పిహెచ్‌సిలను జిల్లా వైద్యాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి రికార్డులు, వైద్య సిబ్బంది హాజరు, ఆసుపత్రిలో అందుబాటు ఉన్న మందులు పరిశీలించారు. హాస్పిటల్‌లో అందిస్తున్న వైద్య సేవలను, రోగులను అడిగి తెలుసుకున్నారు. మనుమకొండలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య శిబిరం ద్వారా వైద్యంతో పాటు, సీజనల్ వ్యాధులపై, హ్యాండ్ వాష్ టెక్నిక్, వ్యక్తిగత శుభ్రత, హెల్త్ న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. హాస్పిటల్‌లో మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బత్తిలి, భామిని పిహెచ్‌సి వైద్యాధికారులు కొండపల్లి రవీంద్ర, పసుపులేటి సోయల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ



ఎమ్మెల్యేకు వినతి పత్రమిస్తున్న సచివాలయ ఉద్యోగులు

జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లను వివిధ ప్రభుత్వ శాఖలలో జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కలిసి వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో ప్రస్తుతం డిజిటల్ అసిస్టెంట్ల అవసరం ఆవశ్యకత పరిమితంగా ఉన్నందున వారి సేవలను ప్రభుత్వం వివిధ శాఖలలో వినియోగించుకునేందుకు జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని కోరారు. గత ఐదు సంవత్సరాలలో అనేక శాఖలకు సంబంధించి విధులు నిర్వర్తించడం ద్వారా అన్ని శాఖలలో జూనియర్ అసిస్టెంట్ స్థాయి విధులపై సమగ్ర అవగాహన కలిగి ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ -4 డిజిటల్ అసిస్టెంట్ సంఘం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉమ్మడి జిల్లాల నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం మాధవిని కురుపాం నియోజకవర్గం జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జనసేన చేస్తున్న కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి కడ్రక మల్లేశ్వరరావు, నాయకులు అధికార అనిల్, ఎస్.వంశీ తదితరులు ఉన్నారు.

27న ఐటిఐ మిగులు సీట్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మిగిలిన సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటన తెలిపారు. ఓఅ.ఖజూ.స్త్రశీజ.ఆఅ వెబ్ సైట్‌కు ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకొని 25న ఏదో ఒక ఐటిఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని అన్నారు.

అన్నవరంలో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నాగావళి నది ఉద్రిక్తత రూపం దాల్చడంతో మండలంలోని అన్నవరం గ్రామాన్ని శనివారం ఎంపిడిఒ రామకృష్ణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, తదితరులు పర్యటించారు. ఇళ్లలో నుంచి ఎవరూ బయటకి రావద్దని కోరారు. మూగ జీవాలును సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచాలన్నారు.

కుళాయి పాయింట్లకు ట్యాపుల ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం



కుళాయి ట్యాప్‌ను బిగిస్తున్న సిబ్బంది

మండల కేంద్రం లోని కస్పా- అక్కులపేట వీధులకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న కులాయి పాయింట్లకు ట్యాపులు లేకపోవడంతో ఈనెల 20న కుళాయి పాయింట్లలో చేరిన మురుగునీరు అన్న శీర్షిక 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి మేజర్ పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం కుళాయి పాయింట్లకు ట్యాపులు అమర్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలకు రూ.60 వేల సామగ్రి వితరణ

ప్రజాశక్తి- సాలూరు

పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ కుటుంబం రూ.60వేల విలువ చేసే స్టాండింగ్ ఫ్యాన్లు, క్రీడా సామగ్రి వితరణ చేశారు. విదేశాల్లో వుంటున్న కంచర్ల కుటుంబీకులు స్థానిక ఉపాధ్యాయుడు బలగ గణేష్ ద్వారా వీటిని అందించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజ్ కుమార్ చేతులు మీదుగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పెంటయ్య చేతికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సిబ్బంది దాతలను అభినందించారు.

18 నెలలుగా జీతాల్లేవ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం వైటిసిలో పనిచేస్తున్న ఉద్యోగులకు 18 నెలలు వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మేనేజర్‌తో సహా మిగతా కిందిస్థాయి ఉద్యోగులకు, గర్భిణి హాస్టల్ వసతి గృహ సిబ్బందికి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిడిపి ప్రభుత్వంలోనైనా సకాలంలో వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

సీతంపేట: స్థానిక గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ షాప్ యజమానులకు మండల విస్తరణ అధికారి కొండపల్లి సత్యం, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం నిషేధం, డెంగీ, మలేరియా, డయేరియా జ్వరాలపై శనివారం అవగాహన కల్పించారు. అలాగే పులిపుట్టి పంచాయతీ సుందరయ్య గూడలో ఇఒపిఆర్‌డి సత్యం, పంచాయతీ కార్యదర్శి అప్పలసూరి ఆధ్వర్యంలో పారిశుధ్యం పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు

పారిశుధ్యంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లోని ప్రతి సంఘ సభ్యురాలికి పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు విఒఎలను ఆదేశించారు. శనివారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా విఒఎలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులతో పాటు గ్రూప్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ఆ దిశగా ప్రతి ఇంటింటికీ వెళ్లి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి


జీవనోపాదుల గురించి గ్రామాల్లో పక్కగా సర్వే నిర్వహించాలని సత్యంనాయుడు విఒఎలను ఆదేశించారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం, ఎపిఎం బి.శివున్నాయుడు, మండల మహిళా అధ్యక్షులు పి.సుజాత, పలువురు సిపిలు, విఒఎలు పాల్గొన్నారు.

పాల'కొండంత' కంపు

● పారిశుధ్య పక్షోత్సవాల్లోనైనా పరిశుభ్రత పాటించరా? ● నగర పంచాయతీ కార్యాలయం దగ్గరే తాండవిస్తున్న అపారిశుధ్యం

ప్రజాశక్తి-పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగరపంచాయతీలో అపారిశుధ్యం తాండవిస్తోంది. సుమారు నలభై వేలకు పైచిలుకు జనాభా ఉన్న పట్టణంలో ఆ స్థాయిలో పారిశుధ్య నిర్వహణ లేదని చెప్పవచ్చు. పట్టణంలోని 20వార్డుల పరిధిలో 353 వీధులు ఉన్నాయి. అందుకు తగినంత మంది పారిశుధ్య కార్మికులు కూడా పూర్తిస్థాయిలో లేరు. అయితే అధికారులు కూడా పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో పట్టణమంతా కంపు కొడుతుంది. అసలే వర్షాకాలం మొదలవ్వడంతో వ్యాధులు కూడా విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో అపారిశుధ్యం తాండవమాడుతోంది. రోడ్డులపై ఎక్కడికక్కడ చెత్త దర్శనమిస్తుంది. నగరపంచాయతీకి కూతవేటు దూరంలోనే చెత్త పోగవ్వడం పట్ల ప్రజల్లో తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదే విధంగా పట్టణం నడిబొడ్డున ఉన్న వెంకటరాయుని కోనేరు పరిసరాల్లోనూ చెత్త వేయడంతో స్థానికులు తమ అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో వర్షాలు పడినప్పుడు కాలువలు పొంగి చెత్త కలిసిన నీరు రోడ్డుపైనే పారుతుంది. ప్రభుత్వం ఆగస్టు 2 వరకు పారిశుధ్య పక్షోత్సవాలు జరపాలని ఆదేశించినప్పటికీ ఇక్కడ నగరపంచాయితీలో జరుగుతున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పట్టణంలో పేరుకుపోయిన చెత్త

ప్రజలు సహకరించాలి : కమిషనర్ సర్వేశ్వర రావు

పారిశుధ్య నిర్వహణలో ప్రజలు సహకరించాలి. ప్రధానంగా పట్టణంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కాలేదు. డంపింగ్ యార్డ్ కోసం చుట్టుపక్కల గుర్తిస్తున్న స్థలాల్లో అక్కడ స్థానికులతో వివాదం జరుగుతుంది. ఇటీవలే తాత్కాలికంగా డంపింగ్ యార్డ్ కోసం ఓనికి వెళ్లే ప్రాంతంలో స్థలం గుర్తించినప్పటికీ వర్షాలతో ఆ ప్రాంతంలోనికి వాహనాలు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. ప్రజలు కొంచెం తమ సహకారం అందించాలి.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సీతానగరం

ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఎంపిపి రమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలు తీర్చడానికి కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను మన సమస్యలుగా భావించాలన్నారు. సమావేశంలో రామవరం సర్పంచ్ పంట సత్యం గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు సేవ కేంద్రంలో నాణ్యత లోపాలతో ఉందని టైల్స్‌తో ఏర్పాటు చేసిన గచ్చు కుంగిపోయిందని దానిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ విషయంపై మండల జెఇకు పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. పంచాయతీరాజ్ డిఇ, గుత్తేదారుకు తెలియజేసి ఆ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. మండలంలో పలుచోట్ల విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలు వెలువెత్తుతున్నాయని, నిత్యం వీధిలైట్లు వెలుగుతూ ఉండిపోతున్నాయని పెదబోగిల మేజర్ పంచాయతీ సర్పంచ్ తెరిజమ్మ మండల విద్యుత్ శాఖ అధికారికి తెలిపారు. దీనికి స్పందిస్తూ సీతానగరంలో లో వోల్టేజ్ ఉందని దానిపై 160 ట్రాన్స్‌ఫార్మర్ వేయగలిగితే కొంత సమస్య తీరుపోతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందించి పై అధికారులకు తెలియజేసి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సబ్సిడీపై సోలార్ రూట్ టాప్ ఏర్పాటు చేస్తామని దానిపై సంప్రదించాలని కోరారు. మండల ంలో ప్రధానంగా మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచిం చారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి, వైస్ ఎంపిపి, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బోనెల

ఆనకట్టు నీటిని విడిచిపెట్టిన ఎమ్మెల్యే

మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన సీతానగరం ఆనకట్టు నీటిని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శనివారం ఉదయం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని దానిలో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు బలోపేతం చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు కూడా మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఈ ఆనకట్ట పరిధిలో వివిధ మరమ్మతు పనులకు సంబంధించి అంచనాలు వేసి తనకు అందజేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కాలువ పరిధిలో తుప్పలు, డొంకలు కొట్టే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శ్రీనివాసరావు, పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, తెంటు వెంకటప్పలనాయుడు, మూడడ్ల వెంకట నాయుడు, కర్రి శంకరరావు, చొంగల సింహాచలం, సోమిరెడ్డి రమేష్, దాసరి శివున్నాయుడు, వాసు దేవరావు, గొట్టాపు అప్పారావు, లబ్బ శ్రీను, తిరుపతిరావు, కంకణాలపల్లి అరవింద్, సూర్యనారాయణ, ఏగిరెడ్డి భాస్కరావు, బిజెపి అధ్యక్షుడు బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతోనే నేలకు సారం

ప్రజాశక్తి - పాచిపెంట

నవధాన్యాల సాగుతోనే నేలతల్లిని కాపాడు కోగలమని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని గోగాడవలసలో నవధాన్య పచ్చిరొట్ట విత్తనాల సాగును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మితిమీరిన రసాయన ఎరువులు వాడడం వల్ల పంట భూములు నిస్సారంగా మారుతున్నాయన్నారు. అంతేకాకుండా భూమిలో జీవ వైవిధ్యం నశించి వానపాములు, ఆరుద్ర పురుగులు వంటి రైతుకు ఉపయోగపడే ఎన్నో రకాల జీవులు నశించిపోతున్నాయి. ఇలాంటి తరుణంలో నేలను సారవంతం చేయాలంటే ఏకైక మార్గం నవధాన్య పచ్చిరొట్ట విత్తనాల సాగేనన్నారు. నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలను ఎకరాకు సుమారు 15 కిలోలు చల్లుకుని పూత దశలో కలియదున్నడం వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగి పంట భూములు సారవంతమవుతాయని అన్నారు. నవధాన్య పచ్చిరొట్ట విత్తనాల్లో పశువులకు కావాల్సిన పచ్చి మేత ఇంట్లోకి కావాల్సిన కూరగాయలను కూడా పొందవచ్చన్నారు. నేల సారవంతంతో పాటు అదనపు ఆదాయం కూడా పొందవచ్చని తెలిపారు. 15 నుండి 20 రకాల విత్తనాలు కలిపి చల్లడం వల్ల వేర్వేరు రకాల వేరు వ్యవస్థలు భూమిలో అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి వేరు వ్యవస్థ చుట్టూ ప్రత్యేకమైన జీవ ద్రవ్యం ఉండడం వల్ల ప్రత్యేకమైన జీవవైవిధ్యం ఏర్పడి పంటకు కావాల్సిన సుమారు 100 రకాల పోషకాలు లభించి ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ప్రతినిధులు శారద, యశోదమ్మ, శ్రీనివాస్, తిరుపతి నాయుడు పాల్గొన్నారు.



కట్టెజనుము పంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

భూమికి సారం - రైతుకు లాభం

గరుగుబిల్లి : మండలంలోని దళాయువలస గ్రామంలో రైతు సత్యనారాయణ క్షేత్రంలో నవధాన్యాలు సాగులో **5X5** మీటర్లలో పంటకోత ప్రయోగం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు సమక్షంలో ఎన్ఎఫ్ఎ ఆర్.శ్రీనివాసరావు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగంలో ఒక ఎకరానికి 4 టన్నులు పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందని, ప్రకృతి వ్యవసాయంలోని 20 నుంచి 30 రకాల విత్తనాలైన నవధాన్యాలు వేసుకొని, 40 రోజులలోపు భూమిలో కలియదున్నడం వల్ల ప్రధాన పంటకు కావలసిన అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా లభించడం వల్ల, భూమి సారవంతం చెందడంతో పాటు పంటలు దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. ఇలా వేసుకోవడం వల్ల పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరిగి, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది డికె బ్రహం, సత్యం, నారాయణ, గౌరు నాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దంచాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ కోరారు. శనివారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా భవన నిర్మాణ సంక్షేమ చట్టం 2006లో ఏర్పాటైందన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు ఇతర అవసరాలకు దారి మళ్లించి ఆ బోర్డును నీరుగార్చారని విమర్శించారు. అయితే ఈ సంక్షేమ బోర్డు ద్వారా ఎలాంటి నిధులు లబ్ధిదారులకు అందకుండా చేశారని దుయ్య బట్టారు. కరోనా సమయంలో పనుల్లేక అల్లాడు తున్న కార్మికులకు రూ.10 వేలు ఇస్తామని చెప్పి నమ్మించి మోసగించారన్నారు. అందుకే భవన నిర్మాణ కార్మికులంతా ఏకమై గడిచిన ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వ హయంలో జిఓ నెంబర్ 17 రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దించాలని కోరారు. గత నాలుగేళ్లలేబర్ కార్యాలయాల్లో పెండింగ్లో ఉన్న క్లెయిమ్ లు, గుర్తింపు కార్డులు తక్షణమే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. ఇసుక పాలసీలో కూడా ఉచితంగా ఇసుక ఇచ్చేందుకు సంస్కరణలు చేపట్టాలని ఆయన కోరారు.

బంగారమ్మ కాలనీలో దాహం కేకలు

ప్రజాశక్తి - సాలూరు



నీటి కోసం వేచి చూస్తున్న మహిళలు

పట్టణం లోని బంగారమ్మ కాలనీలో గత నెల రోజులుగా ప్రజలు తాగునీటి కొరత ఎదుర్కొంటున్నారు. కాలనీలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలకు దగ్గరలో ఉన్న పైలట్ వాటర్ స్కీం 20 రోజులుగా పని చేయడం లేదు. దీంతో సమీపంలో ఉన్న నిరుపేద గిరిజన కుటుంబాలు తీవ్ర నీటి కొరత ఎదుర్కొం టున్నాయి. పైలట్ వాటర్ స్కీంకు చెందిన మోటార్ పాడవ్వడంతో పని చేయడం లేదని, మరమ్మతు చేయాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు స్పందించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో మొత్తం ఏడు పైలట్ వాటర్ స్కీంలుండగా కేవలం మూడు మాత్రమే పని చేస్తున్నాయి. వెంటనే వాటర్ స్కీంను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రేమికుల ఆత్మహత్య

పురుగుల మందు తాగి గంటల వ్యవధిలో మృతి.. ఇద్దరూ వివాహితులే

ప్రజాశక్తి- సీతంపేట



మృతి చెందిన అన్నపూర్ణ, వెంకటరావు

మండలంలో చిన్నబగ్గ పంచాయతీ జరడ కాలనీకి చెందిన అన్నపూర్ణ (30), అదే గ్రామానికి చెందిన వెంకటరావు(35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వీరిద్దరూ రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా శుక్రవారం రాత్రి అన్నపూర్ణ, శనివారం ఉదయం వెంకటరావు మృతి చెందారు. పోలీసుల కథను ప్రకారం జరడ కాలనీకి చెందిన తాడంగి అన్నపూర్ణ ఈ నెల 4న అదృశ్య మైందని తన భర్త తాడింగి కృష్ణారావు సీతంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన తాడంగి వెంకటరావుతో కలిసి ఆమె హైదరాబాదు వెళ్లిపోయారని సమాచారం అందడంతో ఇరు వర్గాల బంధువులు, పెద్దలు హైదరాబాదు వెళ్లి వారిని స్వగ్రామానికి శుక్రవారం తీసుకొస్తుండగా మండలంలోని కుసిమి సమీపం వచ్చేసరికి వారిద్దరూ పెద్దలతో వివాదానికి దిగారు. మేమిద్దరమూ ప్రేమించుకుంటున్నామని మమ్మల్ని విడగొట్టవద్దని వాదించారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ ఒకరి తరువాత ఒకరు బహిర్భూమికి వెళతామని చెప్పి కారు దిగారు. పక్కకు వెళ్లగానే ఇద్దరూ వారి వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగేశారు. తరువాత కారు ఎక్కేశారు. కారులో ఉన్నవారికి పురుగుల మందు వాసన రావడంతో అనుమానం వచ్చి నిలదీయగా పురుగులు మందు తాగేసి తాము ఆత్మహత్య చేసుకున్నామని చెప్పారు. వెంటనే బంధువులు వారిద్దరినీ అదే కారులో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అన్నపూర్ణ అదే రోజు మృతి చెందగా వెంకటరావు శనివారం ఉదయం మృతి చెందాడు. అన్నపూర్ణకు ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు. వెంకటరావుకు కుమార్తె, భార్య ఉన్నారని ఎస్ఐ ఎం జగదీష్ నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. గంటల వ్యవధిలో గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

సమర్థవంతంగా సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధి హామీ చట్టం నిధులతో 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై 17వ సామాజిక తనిఖీ మండలంలోని 23 పంచాయతీలలో సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపిడిఒ ఎస్ అప్పారావు కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఎపిఒ పి.బావాజీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం, ఉపాధి హామీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఐటిడిఎ, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఉపాధి హామీ పథకం వేతన దారులకు పనులు కల్పించినందుకు రూ.16.96కోట్లు వెచ్చించామన్నారు. దీనికి సంబంధించిన సామాజిక తనిఖీ కోసం పంచాయతీ పరిధిలోనికి వచ్చే తనిఖీ బృందాలకు సమాచారం అందించేందుకు సహకరించాలని కోరారు. ఎపిడి సురేష్ నాయుడు, ఎస్ఆర్‌పిలు దాసు, మాధవ రావు, పంచాయతీ రాజ్ శాఖ ఎఇ నాగేశ్వర రావు, గిరిజన సంక్షేమ శాఖ రవి కుమార్, ఇసి మూర్తి, సిబ్బంది, పాల్గొన్నారు.

సారా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- కొమరాడ

అక్రమంగా నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై నీలకంఠం తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో నాటు సారా రవాణా అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని గుణాల గ్రామం వద్ద నాటు సారా అమ్ముతున్న గుమడకు చెందిన కొప్పల పేతురును అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద 240 నాటు సారా ప్యాకెట్లు (24 లీటర్లు) స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని తెలిపారు. మండలంలో అక్రమంగా మద్యం, నాటు సారా, గంజాయి వంటి నిషేధిత వస్తువులు అమ్మకాలు చేస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



నాట్లు వేస్తున్న మహిళలు

జోరుగా ఉబాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. రైతులు దమ్ములు పట్టడం, ఆకు తీయడం, వరి నాట్లు వేయడంలో బిజీగా ఉన్నారు. గత ఏడాది కంటే ముందుగానే మన్యం ప్రాంతంలో పొలం పనులు ప్రారంభం కావడం విశేషం. నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస మండలాల్లో వ్యవసాయ పనులు జరుగు తున్నాయి. మరోవైపు కొండపోడు వ్యవసాయ పనులు కూడా గిరిజనులు ప్రారంభించారు. గత మూడేళ్లుగా సమయానికి వర్షాలు లేక కరువు ఛాయాలతో ఇబ్బంది పడ్డ గిరిజన రైతులు సకాలంలో వర్షాలు కురవడంతో సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు.

కొత్త మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుడ్డపల్లి పంచాయతీ కొండపల్లిలో మోటర్ మరమ్మతులకు గురికావడంతో కార్యదర్శి వై.పాపారావు స్పందించి వెంటనే కొత్త మోటర్ కొనుగోలు చేసి దగ్గరుండి బిగించడానికి చర్యలు తీసుకున్నారు. ఈ గ్రామంలో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. అదేవిధంగా గ్రామంలో జ్వరాలపై ఆరా తీశారు.

గడగమ్మలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మలో 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులతో పాటు వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మన ఇల్లు, మన ఊరు ఎల్లప్పుడూ పరిసరాలు, పరిశుభ్రతను పాటించడం ద్వారా మన ఆరోగ్యంతో పాటు మన వారి ఆరోగ్యం కూడా బాగుంటుందని ఇది మనందరి బాధ్యత అని ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రతి గ్రామం లోనూ పారిశుధ్య లోపం వల్ల ప్రజలు అంటు వ్యాధులకు గురవుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో గ్రామంలో ప్రతి పాఠశాల నుంచి ఆయా విద్యార్థులు ర్యాలీ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

రోడ్లను పాడు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని ప్రస్తుత వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు ఉబాలు చేసేందుకు ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారు. అయితే ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా దమ్ముట్రాక్టర్లను ఫుల్ వీల్‌కు రబ్బరు తొడుగు వాడకపోవడంతో లక్షలాది రూపాయలు నిధులతో నిర్మించిన బిటి రోడ్లు మరమ్మతుకు గురవుతున్నాయని స్థానిక ఎస్సై పి.అనీష్ తెలిపారు. కావున ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు ఫుల్ వీల్ ట్రాక్టర్లకు కచ్చితంగా రబ్బతొడుగులను ఉపయోగించి తమ పనులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. రోడ్లు మరమ్మతులకు గురైతే అందుకు సంబంధించి పూర్తి బాధ్యత ట్రాక్టర్ యజమానులే భరించాల్సి వస్తుందని హెచ్చరించారు.